నాసిరకంగా చెక్‌డ్యామ్ పనులు

- ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా నిర్మాణం
- గోదావరి ఇసుకకు బదులు, పాలేరు ఇసుక వినియోగం
- మోతాదుకు మించి వాడుతున్న డస్ట్
- పట్టించుకోని అధికారులు


నాసిరకంగా నిర్మిస్తున్న చెక్‌డ్యామ్


మోతాదుకు మించి వాడుతున్న డస్ట్ కుప్ప

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామం, తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామాల మధ్య పాలేరు వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యామ్ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పాలేరు వాగు సమీపంలో ఉన్న రెండు మండలాల రైతులకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో సుమారు రూ.5కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు డ్యాం నిర్మాణానికి గోదావరి ఇసుక వాడాల్సి ఉంది, కాని కాంట్రాక్టర్ మాత్రం ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా మట్టితో కలిసి ఉన్న నాణ్యత లేని పాలేరు వాగు ఇసుకను వాడుతున్నాడు. నిర్మాణంలో ప్రతీ ఎనిమిది బేషన్ల ఇసుకకు రెండు బేషన్ల డస్ట్ వాడాలి. కాని ఐదు బేషన్ల ఇసుక, ఐదు బేషన్ల డస్ట్ వాడుతున్నాడు. ఎంతో నాణ్యతగా నిర్మించాల్సిన చెక్‌డ్యామ్ పనులు నాసిరకంగా నిర్మిస్తున్నారని, ఎప్పుడు కూలిపోతుందో అని రైతులు, ఇరుగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువు

కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం రెండు మండలాలకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న చెక్ డ్యామ్‌పై సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఎక్కడ అని రైతులు, గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గోదావరి ఇసుకకు బదులు, పాలేరు వాగు ఇసుక వాడుతున్నారని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. అధికారులు పరిశీలించకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిర్మాణం చేస్తున్నాడని, ఇప్పటికైన చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తిస్థాయిలో పరిశీలన జరపాలని కోరుతున్నారు.

నాసిరకంగా నిర్మాణం

రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న చెక్‌డ్యాం నాసిరకంగా నిర్మిస్తున్నారు. ఇలా నిర్మాణం చేపడితే ఎప్పుడు కూలిపోతుందో తెలియదు. కొంతమంది కిందిస్థాయి అధికారులు నిర్మాణం లోపం ఉందని చెప్పిన కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని పరిశీలించాలి.



- చిలసాని వినిత్, రైతు, పెద్దముప్పారం

గిరిజనులు ఐకమత్యంగా ఉండాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


నెహ్రూసెంటర్: అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, నాయకులు

నెహ్రూసెంటర్: గిరిజనులు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ 28వ వార్షికోత్సవ సభను జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజన తండాలు జీపీలు మారాయని, వాటి అభివృద్ధికి, రెవెన్యూ గ్రామాలుగా ఏర్పాటు చేసుకునేలా గిరిజనులు ముందుకు పోవాలని సూచించారు. కేంద్రం గోరీబోలి భాషను 8వ షెడ్యుల్‌లో చేర్చి అధికారిక భాషగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోట్యానాయక్, ఆంగోత్ చందులాల్, బోడ లక్ష్మణ్‌నాయక్, గుగులోత్ హరినాయక్, భూక్య నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి

మహబూబాబాద్ రూరల్: నేడు హైదరాబాదు ఎల్బీ స్టేడియంలో జరుగనున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. ఈమేరకు నాయకులు, కార్యకర్తలతో జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, సంవిధాన్ బచాఓ కమిటీ సభ్యుడు వెన్నం శ్రీకాంత్ రెడ్డి, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, నాయకులు మిట్టకంటి రామిరెడ్డి, ఎండీ.ఖలీల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


విద్యార్థులతో డీఈఓ రవీందర్‌రెడ్డి

- డీఈఓ రవీందర్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని డీఈఓ రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని కంబాలపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నూకల కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా వారి కుమారుడు నూకల మహేందర్ రెడ్డి 2024 పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు వెంపటి విఘ్నేశ్ రూ.10వేలు, ధనుంజయ్ రూ.6వేలు, శివకుమార్ రూ.4వేలు అందజేశారు. అలాగే పాఠశాలలో చదివి జేఈఈ 2025లో ఐఐటీలో సీటు వచ్చిన విద్యార్థులు ప్రశాంత్, సాయిలేఖ్యను సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శనచారి రూ.3వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో దాత సోదరుడు, రిటైర్ ఎయిర్ కమాండర్ నూకల నరేందర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, హెచ్‌ఎం ఉప్పలయ్య, విద్యాకమిటీ మాజీ చైర్మన్ చిరంజీవి, ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్ రెడ్డి, ఉప్పలయ్య, సోహన్ బి.శ్రీనివాసరావు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు


నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న వెంకన్న

నెహ్రూసెంటర్: కార్మిక వ్యతిరేక కేంద్ర ప్రభుత్వం, మోదీ విధానాలపై కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న అన్నారు. జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సనప సోమ్మన్న, ఆకుల రాజు, కుంట ఉపేందర్ పాల్గొన్నారు.

కార్మికుల చట్టాల నిర్వీర్యం

గార్ల: కార్మికుల హక్కులను కాలరాసేందుకు, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ, వారికి లాభం చేకూర్చే విధంగా కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు బండ్ల అప్పిరెడ్డి, కందునూరి శ్రీనివాస్, వెంకటయ్య, సుధాకర్, దాసు పాల్గొన్నారు.

చోరీ చేస్తూ పట్టుబడిన మహిళ

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి శ్రీ ఓంసాయి ఏమార్ట్ దుకాణంలో సబ్బులను చోరీచేస్తూ, సీసీ కెమెరా ఆధారంగా ఓ మహిళ పట్టుబడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. షాపు నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 12న (గురువారం) ఏమార్ట్‌లో అప్పుడే స్టాక్‌పెట్టిన రూ.3,400 విలువైన 8 టీపొడి డబ్బాలు(500 గ్రాములు) కనిపించకపోవడంతో, సదరు వ్యాపారి బచ్చు పరమేశ్వర్‌కు అనుమానం వచ్చి సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా, నలుగురు మహిళలు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని విచారించారు. నర్సింహులపేట మండలం ముంగిమడుగు గ్రామానికి చెందిన మహిళగా గుర్తించినట్లు తెలిపారు. కాగా గతంలో ఇదే ఏమార్ట్‌లో చోరీకి పాల్పడింది తామేనని ఒప్పుకోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

దోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త పోటు అరుణ(48)అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. మండలంలోని సత్యాతండా అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. గురువారం డోర్నకల్ ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మితోపాటు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ మృతదేహం వద్ద నివాళులర్పించారు. సీడీఎస్ నుంచి వచ్చిన రూ.20వేల చెక్కును సీడీపీఓ బాధిత కుటుంబానికి అందజేశారు.

పాఠశాలలను సీజ్ చేయాలి


ధర్నా చేస్తున్న డీఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్న ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని డీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు కేలోతు సాయికుమార్, శాంతి కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట సంఘం నాయకులు గురువారం ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఎస్వీ విద్యాలయం పేరు గుర్తింపుతో శ్రీచైతన్య పాఠశాల నడిపిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు పాఠశాలను సందర్శించి విచారణ చేశారని, అయిన పాఠశాలపై చర్య తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, దేవేందర్, యుంగధర్, ప్రకాష్, తిరుపతి, తరుణ్, విష్ణు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి


అధికారికి వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో కళాశాలల హాస్టళ్లకు సొంత భవనాలు లేక అద్దె భవనంలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటు ఉంటున్నారని, ప్రభుత్వం వెంటనే సొంత భవనాలు నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు అన్నారు. జిల్లా వెనకబడి తరగతుల శాఖ కార్యాలయంలో గురువారం జిల్లా అధికారి ఎం.నర్సింహస్వామికి ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, బీసీ కళాశాలల హాస్టళ్లు ప్రస్తుతం అద్దెభవనంలో కొనసాగుతున్నాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సింహాద్రి, పవన్, రాకేష్, మహేష్, వినోద్, ప్రణయ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం: ఇందిరమ్మ ప్రభుత్వంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు కలుగుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 40మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. బయ్యారం పెద్దచెరువు కాల్వల మరమ్మతులకు మంజూరైన రూ.35లక్షలతో చేపట్టనున్న పలు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, సీఐ రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అశోక్

గూడూరు: సమాజంలో నేటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని అరవింద విద్యాలయంలో గురువారం ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా కృష్ణమూర్తి అధ్యక్షతన బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం బాల్య వివాహాలను నిరోధించాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. అనంతరం బాల్య వివాహాలపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యాలయ కరస్పాండెంట్ పింగిళి శ్రీనివాస్, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, పగిడిపాటి ప్రసాద్, రుషికేష్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్నాయి..


వరద నీటిలో వెళ్తున్న ద్విచక్రవాహనం

మండల కేంద్రంలోని అంతర్గత రోడ్లు చిన్నపాటి వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. గత రెండు రోజులుగా కురిసిన మోస్తారు వర్షానికి మండల కేంద్రంలోని దాశరథి గ్రంథాలయం నుంచి బస్టాండ్ వరకు రోడ్లపై వరద నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రోడ్లు బురదమయంగా మారి గుంతలు కనబడక పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇదే రోడ్డులో రెండు రోజుల క్రితం గుంతలు కనబడక ద్విచక్రవాహనదారుడు కిందపడి స్వల్పగాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతల రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

- చిన్నగూడూరు

సంక్షిప్త సమాచారం

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మహబూబాబాద్ అర్బన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, రెండు రోజులుగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలను బంద్ విజయవంతమైందని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి మునిగాల మహేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం పీడీఎస్‌యూ నాయకులు బంద్ నిర్వహించి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో విజయ్, అసీఫ్, శేఖర్, సురేష్, చంటి, సుప్రియ, అనూష, దిలీప్, శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

కేసముద్రం: తమకు పట్టాపాస్ బుక్కులు అందించాలంటూ మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 3వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవి, రైతులు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడి రెడ్డి పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

నర్సింహులపేట: మండలంలోని రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలలో మహి మెమోరియల్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

నానో ఎరువుల వాడకంపై అవగాహన

బయ్యారం: నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వాడకంపై గురువారం బయ్యారంలో ఏఓ రాంజీ రైతులకు అవగాహన కల్పించారు.

అందుబాటులో వరి విత్తనాలు

కురవి: మండల కేంద్రంలోని ఆంధ్రాబ్యాంకు సొసైటీలో ఆర్ఎన్ఆర్ 15048 వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కురవి ఏఈఓ రాజేశ్వరీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నాయకుడి మృతి

కొత్తగూడ: మండల కేంద్రానికి చెందిన సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు యాదగిరి యుగేందర్(65) బ్రెయిన్‌స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నాయకులు నివాళులర్పించారు.

జయప్రదం చేయండి

బయ్యారం/డోర్నకల్/తొర్రూరు: ఈనెల 5, 6 తేదీల్లో కురవిలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెల్లూరి నాగేశ్వర్ రావు పిలుపునిచ్చారు. మహాసభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు.

మార్కెట్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన



కేసముద్రం: మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో కార్యదర్శిపై, వైస్ చైర్మన్ దాడి చేయడాన్ని ఖండిస్తూ, గురువారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో భోజన విరామ సమయంలో అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు.

ఆలయంలో పూజలు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని రిటైర్డ్ అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి దంపతులు గురువారం సందర్శించారు. ఈమేరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కురవి: యువతీ, యువకులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కురవి ఎస్సై గండ్రాతి సతీష్ అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో సైనిక ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జ్ తేజావత్ వీరన్న అధ్యక్షతన అవగాహన సదస్సు జ రిగింది. కార్యక్రమంలో హెచ్‌ఎం వాహిద్, ప్రణీత్, తేజావత్ రఘు పాల్గొన్నారు.

నివాళి

గార్ల: మృతుడు ప్రశాంత్‌కు తల్లితండ్రులు చిన్నతనంలోనే చనిపోవడం, అయినవాళ్లు ఎవరూ లేకపోవడంతో స్నేహితులే అయినవాళ్లుగా మారి మృతుడికి దశదినకర్మ చేసిన సంఘటన గురువారం గార్లలో జరిగింది. మృతుడి చిత్రపటానికి పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇంటింటి ప్రచారం

గార్ల: పట్టణంలో ఈనెల 5వ తేదీన నిర్వహించే పూరి జగన్నాథ రథయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ నిర్వాహకులు గురువారం గార్లలో కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాంభద్రయ్య, సత్యనారాయణ, లక్ష్మిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కందుల మినీ కిట్స్ పంపిణీ

దంతాలపల్లి: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం రైతులకు కందుల మినికిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపత రాము, ఏఎంసీ తొర్రూరు వైస్ చైర్మన్ బట్టు నాయక్, ఏఓ వాహిని, ఏఈఓలు దీక్షిత్, ఉదయ్ కిరణ్, శిరీష, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

పీరీల సందడి



దోర్నకల్: డోర్నకల్‌తోపాటు పలు గ్రామాల్లో మోహర్రం పండుగను పురస్కరించుకుని పీరీలు సందడి చేస్తున్నాయి. డోర్నకల్‌లోని మెయిన్ రోడ్డు బ్యాంక్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో పీరీలను ఊరేగించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..

కురవి: సీరోలు మండలం కాంపల్లి శివారు సక్రాం నాయక్ తండాలో ఇటీవల బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తేజావత్ బిచ్చు నాయక్ తండ్రి అమర్ సింగ్ మృతి చెందాడు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కందికొండ గ్రామానికి చెందిన బండి రాజు బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ గురువారం నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య, యూత్ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవినాయక్, పెద్ది వెంకన్న, సతీష్, పుల్సాని శ్రీనివాస్‌రెడ్డి, బండి యతిరాజ్ పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన అవసరం


పెద్దవంగర: అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై వెంకన్న

పెద్దవంగర: చిన్న వయసులోనే గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి విద్యార్థినీలకు అవగాహన కల్పించాలని ఏఎస్సై వెంకన్న అన్నారు. గురువారం మండలంలోని చిన్నవంగర కేజీబీవీ పాఠశాల్లో విద్యార్థినీలకు బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, అక్రమ రవాణా, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజారాం, ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీపీఐ పట్టణ కమిటీ ఎన్నిక


కుమార్


వెంకన్న


నవీన్

నెహ్రూసెంటర్: సీపీఐ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి గురువారం తెలిపారు. పట్టణ కార్యదర్శి, సహాయ కార్యదర్శిగా తిరిగి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ ఎన్నిక కాగా, మరో నూతన సహాయ కార్యదర్శిగా చింతకుంట్ల వెంకన్నను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యదర్శివర్గ సభ్యులుగా మామిండ్ల సాంబలక్ష్మీ, వీరవెల్లి రవి, వెలుగు శ్రావన్, ఎండి. ఫాతిమా, నర్ర శ్రావణ్ ఎన్నికయ్యారు.

సరి చేసిన విద్యుత్ స్తంభాలు



సాక్షి ఎఫెక్ట్..

మరిపెడ రూరల్: మండలంలోని రాంపురం ప్రధాన రహదారి వెంట ఇటీవల కురుస్తున్న వర్షాలకు రెండు విద్యుత్ స్తంభాలు వాలిపోయాయి. ఈ మేరకు 'ఒరిగిన విద్యుత్ స్తంభాలు' అనే కథనం గురువారం ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు చేపట్టి నిటారుగా ఉండేలా స్తంభాలను సరిచేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

మహబూబాబాద్ అర్బన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్.రామచందర్‌రావును జిల్లా బీజేపీ అధ్యక్షుడు వల్లభూ వెంకటేశ్వర్లు, నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా గురువారం కలిసి సన్మానించారు.

సభ్యత్వ నమోదు



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థుల మధ్య కులాల అంతరాన్ని పెంచే ఇంటిగ్రేటెడ్ పాఠశాలల విధానం కాకుండా ఒకే తరగతిలో అన్ని సామాజిక వర్గాల పిల్లలకు బోధించే విధానం కావాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఘనపురం భిక్షపతి, ప్రధాన కార్యదర్శి సారెడ్డి రామలింగారెడ్డి, హెచ్‌ఎం మాలోతు కొట్యానాయక్, రఫీక్, దుర్గయ్య, రంజిత్‌కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడ: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కుశకుమార్ సూచించారు. మండలంలోని పొగుళ్లపల్లి ఏకలవ్య గురుకుల జూనియర్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం పోలీస్ కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కురవి: సీరోలు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మని చందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను గురువారం తహసీల్దార్ పున్నంచందర్, ఎంఈఓలు ఇస్లావత్ లచ్చిరాంనాయక్, వరదరాజులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తిరుపతి, హర్షవర్ధన్ రెడ్డి, వెంకన్న, గురువయ్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



గార్ల: గార్లలోని మసీదు సెంటర్‌లో గల నాలుగు కూడళ్ల ప్రధాన బీటీ రహదారిపై గ్రామ పంచాయతీ సిబ్బంది గుంతను తీశారు. కాని దానిని పూడ్చడం మరిచిపోవడంతో ఈ ప్రాంతం గుండా వెళ్లే ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయంలో స్పీడ్‌గా వచ్చి కిందపడిపోవడంతో అనేక మంది తీవ్రగాయాల పాలయ్యారు. గుంతను వెంటనే పూడ్చి ప్రమాదాలను నివారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.